క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేందుకు అశ్వారావుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయా కేంద్రాలను ఆయన పరిశీలించి, రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ..సొసైటీ పరిధిలో అశ్వారావుపేట, ఊట్లపల్లి, జమ్మిగూడెం, మద్దికొండ, అచ్యుతాపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఏ– గ్రేడ్ ధాన్యాన్ని క్వింటా రూ.2,320, దొడ్డు రకానికి రూ.2,300, అలాగే సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 రూపాయాలు బోనస్ చెల్లిస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మానేపల్లి విజయ్‌బాబు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

చర్ల: ఐకేపీలో పని చేస్తున్న వీఓఏలకు శ్రీనిధి ప్రోత్సాహకాలతో పాటు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చర్లలో ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి నేతృత్వంలో వీఓఏలు ప్రదర్శనగా వెళ్లి ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు ఇర్పా అనురాధ మాట్లాడారు. సంఘం నాయకులు పాయం రవి, కొమరయ్య, దుర్గ, అర్జున్, సుధా, భవాని, కృష్ణవేణి పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా

చంద్రుగొండ: తెలంగాణ మలిదశ ఉద్యమకారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ అక్బర్‌కు అందించారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఆందోళనలో ఉద్యమకారులు గాదె లింగయ్య, ఎస్‌కె.జాఫర్, ఎస్‌కె.ఉమర్, యండి.జాకీర్, వరికూటి వెంకట్రావ్, దుంప అర్జున్, తేజావత్ భీముడు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని పాత నారాయణరావుపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధిత కూరం ప్రశాంత్ కుటుంబానికి సీపీఎం మండల కమిటీ యలమంచి సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి శీను బాబు, మాజీ ఎంపీటీసీ పెనుబలి సీతమ్మ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

హక్కులకై ఉద్యమించాలి

గుండాల: ఆదివాసీల కోసం నిరంతరం పోరాడిన కోమరం భీం పోరాట స్ఫూర్తితో సమాజ శ్రేయస్సు కోసం యువత హక్కులు, చట్టాల కోసం ఉద్యమించాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం తుడుందెబ్బ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోవింద నర్సింహారావు, కార్యదర్శిగా మోకాళ్ల మహేందర్, ఉపాధ్యక్షుడిగా చింత వెంకటేశ్వర్లు, కుంజ సత్యం, కోశాధికారిగా జవ్వాజి జోషి, ఈసం సారయ్య, ఈసం రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాలరాజు, వజ్జ ఎర్రయ్య, పూనెం శ్రీను పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి

దమ్మపేట: మసీదుల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ.. సత్తుపల్లి జామా మసీదు నూతన కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. సోమవారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన మసీదు కమిటీ సభ్యులను, తుమ్మల శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. సత్తుపల్లి పట్టణంలో ఉన్న మసీదుల అభివృద్ధి, పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కమిటీ సభ్యులు కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు.

బస్ సౌకర్యం కల్పించాలి

మణుగూరురూరల్: మణుగూరు నుంచి పినపాక మండలం టి.కొత్తగూడెం వరకు బస్ సౌకర్యం కల్పించాలని, చేగర్శల నుంచి టి.కొత్తగూడెం వరకు రోడ్డును బాగు చేయాలని కోరుతూ.. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, టీఎస్ఆర్‌టీసీ మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్‌కు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలను వినియోగించుకోవాలి

- ప్రైవేటును ఆశ్రయించి నష్టపోవద్దు
- తేమపేరుతో అధికారులు కొర్రీలు పెట్టొద్దు
- పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం



బూర్గంపాడు: లక్ష్మీపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: సీసీఐ కేంద్రాలను పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో శ్రీరామా కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కేంద్రంలో పత్తి క్వింటాకు మద్దతు ధర రూ.7,521ను అందిస్తున్నట్లు తెలిపారు. సీసీఐ కేంద్రం నిర్వాహకులు తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, ఏడీఏ తాతారావు, ఏఓ సాయిశంతన్‌కుమార్, భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీడీఓ వరప్రసాద్, సీఐ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, జిన్నింగు మిల్లు నిర్వాహకులు భిక్షమయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

బూర్గంపాడు: రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తిని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరలను పొందాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. లక్ష్మీపురంలోని జిన్నింగ్ మిల్లులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లలో సీసీఐ అధికారులు కూడా రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీసీఐ బయ్యర్ సంజీవరావు,ఏడీఏ తాతారావు,ఎంపీడీఓ జమలారెడ్డి, ఏఓ శంకర్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యసేవలు పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. లక్ష్మీపురం గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తొమ్మిదిమంది లబ్ధిదారులకు రూ 2.85 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం అంజనాపురం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న, బానోత్ సుక్కిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన తేజావత్ శ్రీనివాస్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఓదార్చారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ



ములకలపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ గుడ్ల పుల్లారావు

ములకలపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తహసీల్దార్ గుడ్ల పుల్లారావు ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో సోమవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సర్వే చేయాలని సూచించారు. డీటీ విజయలక్ష్మి, ఎంపీడీఓ మహాలక్ష్మి, ట్రైనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి సర్వేపై మండల అభివృద్ధి కార్యాలయంలో ఇన్యూమరేటర్ల డిజిటల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, ఎంపీఓ రామకృష్ణ, ఏఓ నవీన్‌కుమార్, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం అశ్వారావుపేట రైతు వేదికలో 116 మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సర్వే చేసే విధానం, వివరాల నమోదుతోపాటు ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీవో సోయం ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: సాంఘిక ఆర్థిక సర్వే కోసం ఎన్యుమరేటర్లకు తహసీల్దార్ రాఘవరెడ్డి సోమవారం శిక్షణనిచ్చారు. సోమవారం మణుగూరులోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణా సమావేశం నిర్వహించగా.. మణుగూరురూరల్ 108 మంది, టౌన్‌లో 70 ఎన్యుమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేశామని, వారు ఈ నెల 6,7,8 తేదీల్లో లిస్టింగ్‌లో పాల్గొని ఇళ్ల జాబితాను తయారు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, కమిషనర్ యాదగిరి, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు వితరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న కొత్త మార్కెట్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ ఇటీవల కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం సదరు దుకాణాల నిర్వహకులు ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్‌ను కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుకు గాను రూ.50 వేలు వితరణగా అందజేశారు. కొత్త మార్కెట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి, నగదును వితరణ చేసిన దుకాణదారులను ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్ అభినందించారు.


విద్యార్థులకు పుస్తకాలు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థి ఎల్లయ్య రెడ్డి పరీక్ష ప్యాడ్‌లు, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రాల మాదిరి ప్రశ్నాపత్రాల పుస్తకాలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సోదరుడు పాల ప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఏవీ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కొండాయిగూడెం గ్రామానికి చెందిన బోయిళ్ల ప్రవీణ్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సోమవారం ప్రవీణ్‌కుమార్ జ్ఞాపకార్థ కూడిక నిర్వహించగా.. అంబేడ్కర్ యువజనసంఘం సభ్యులు హాజరై రూ.31వేల ఆర్థిక సహాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

ములకలపల్లి: సేవా కార్యక్రమాల నిర్వహణతో సంతృప్తి లభిస్తోందని టీఎన్నార్ ట్రస్ట్ చైర్మన్, ఎన్నారై తాంద్ర వెంకటేశ్వరరావు తెలిపారు. ములకలపల్లిలో నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని సోమవారం ప్రారంభించగా.. మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. తన తండ్రి నారాయణరావు పేరిట ట్రస్ట్ ఏర్పాటుచేయగా, ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చానని తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పోతుగంటి క్రాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎఫ్ఆర్ఓ రవికిరణ్, ఎంఈఓ సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్‌కుమార్, టీయూడబ్ల్యూజే (జేటీఎఫ్) రాష్ట్ర నాయకులు చంద్ర నర్సింహారావు, కొండల్‌రావుతో పాటు జునుముల రమేశ్, ఎండి.ఉస్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ ర్యాలీ



దమ్మపేట కూడలిలో మానవహారంగా ఏర్పడిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

దమ్మపేట: పరిసరాల పచ్చదనం, పరిశుభ్రతలపై అవగాహన కల్పిస్తూ.. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. సోమవారం కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మల్లారం గ్రామంలోని రైతు వేదిక, ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు రాంప్రసాద్, రెడ్డి ప్రియ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, మానవాళి జీవన ప్రమాణాలను పెంచుతుందని పేర్కొన్నారు. అనంతరం వరి, మొక్కజొన్న వంటి పంటల విత్తనోత్పత్తి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విత్తనాల తయారీలో పాటించాల్సిన మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సమగ్రంగా వివరించారు. శాస్త్రవేత్తలు మధుసూదన్ రెడ్డి, ఝాన్సీ మాట్లాడుతూ.. అధిక విత్తన దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు

దమ్మపేట: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల కోసం వెతుకుతూ డాగ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మండలంలోని నాగుపల్లి గ్రామంలో గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమంగా దాచి ఉంచారనే సమాచారం మేరకు పలువురి ఇళ్లల్లో డాగ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీలు చేయగా ఎలాంటి మత్తు పదార్థాలు లభించలేదు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్తులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. వాటిని వాడినా, కలిగియున్న చట్టరీత్యా నేరం అని, అందుకు తగిన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వీర, హోంగార్డు మోషే తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ కోత

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి, నాగుపల్లి, నాచారం, గట్టుగూడెం, మందలపల్లి, నాయుడుపేట, లింగాలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో రేపు (బుధవారం) అంతరాయం ఏర్పడుతుందని దమ్మపేట ఏఈ సాయికిరణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గంగారం సబ్‌స్టేషన్ పరిధిలోని 132 కేవీ నూతన బ్రేకర్ పనులు నిర్వహించాల్సిన కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీఎన్ఆర్‌కు డాక్టరేట్

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బసవులు నాగేశ్వరరావు(బీఎన్ఆర్)కు గాడ్ సన్ హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో చేసిన కృషికి గాను ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. బీఎన్ఆర్‌ను సారపాకకు చెందిన పలువురు అభినందించారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా కార్తీక్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ సేవాదళ్ అధ్యక్షుడిగా దేశ్ కార్తీక్‌ను నియమిస్తూ జిల్లా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య సోమవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి దయాకర్, జిల్లా అధ్యక్షుడు కేశబోయిన నరసింహారావు సమక్షంలో నియామక పత్రం అందజేశారు. బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కార్తీక్ కృతజ్ఞతలు తెలిపారు.

25వ సారి రక్తదానం

అశ్వాపురం: ఎందరికో రక్తదానం చేస్తూ ప్రజలతో భేష్ అనిపించుకుంటున్నాడు మండల కేంద్రానికి చెందిన గద్దల రామకృష్ణ. బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ మండల పరిధిలోని చింతిర్యాలగూడెం గ్రామానికి చెందిన గర్భిణి ఇర్పా వాణికి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం రక్తదానం చేశాడు. రక్తదానం చేయడం ఇది 25వ సారి.

సీపీఎం బలోపేతానికి కృషి చేయాలి

అశ్వాపురం: సీపీఎం బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం గ్రామాల పార్టీ గ్రామశాఖల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో యువతను పార్టీ వైపు నడిచేలా ప్రోత్సహించాలన్నారు.

పారదర్శకంగా ఉండాలి

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా ఉండాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు మూడు బాలాజీనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వారికే ఇళ్లు మంజూరు చేయాలని తహసీల్దార్ సంధ్యారాణికి సోమవారం వినతిపత్రం అందించారు.

‘అనుమతులు ఎలా ఇచ్చారు?’

దుమ్ముగూడెం: ఏజెన్సీలో భారీ ఎత్తున 10రోజులుగా గ్రావెల్ తోలకాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు సోమవారం ఓ ప్రకటనలో రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ములకపాడు పంచాయతీలో 10 రోజులుగా ఇష్టానుసారంగా వేల ట్రిప్పులు గ్రావెల్ తోలకాలకు జరుగుతున్నాయని అన్నారు. గిరిజనులు సొంత ఇంటి నిర్మాణం కోసం గుప్పెడు మట్టికి అనుమతి ఇవ్వని రెవెన్యూ అధికారులు.. వీరికి అనుమతులు ఎలా ఇచ్చారని అన్నారు.

‘సాక్షి’ స్పెల్ బీ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో సాక్షి పత్రిక ఆధ్వర్యంలో సోమవారం స్పెల్ బీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష నాలుగు కేటగిరీల్లో నిర్వహించగా.. 14 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.అబ్రహం మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభా పాటవాలను మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధా మంజరి, పాఠశాల డైరెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాటు సరే.. నిర్వహణ ఏది?



ఐరన్ మెస్‌ను గోదావరి నదిలోకి మారుస్తున్న కూలీలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదవరి నదిలో ఇటీవల జరుగుతున్న ప్రమాదాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భద్రాచలం ఆర్డీఓ దామోదర్ నది తీరంలో ఐరన్ మెస్‌ను ఏర్పాటు చేయించారు. కాగా గోదావరి నదిలో నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ఐరన్ మెస్ ఒడ్డున తేలింది. ఇంత కాలం దానికి పట్టిన బురద అంతా బహిర్గతం బయటకు వచ్చింది. ఈ పరిస్థితిని అధికారులు పట్టించుకోకపోవడంతో, కార్తీక సోమవారం సందర్భంగా గోదావరి నదిలో స్నానం చేసేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని చూసి అక్కడున్న దుకాణాదారులు ఒక్కొక్కరు కొంత నగదును వేసుకుని ఆ ఐరన్ మెస్ గోదావరి నది లోపలికి జరిపేందుకు కూలీలను పెట్టారు. భక్తులు దుకాణాదారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



తాలిపేరు నీటికాలువను పరిశీలించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే తెల్లం

దుమ్ముగూడెం: మండలంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మండల పరిధిలో సుమారు 250 ఎకరాల సాగుకు అవసరపడే తాలిపేరు నీటికాలువను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పూడికతీత– కాలువ వెడల్పుకు సంబంధిత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్ష్మీనగరం గ్రామంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువు విషయమై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజిపాక గ్రామానికి చెందిన ప్రజల పంట పొలాలకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా కల్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి తియాజ్ మహమ్మద్ ఖాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ రామకృష్ణ, ఏఓ నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, సుధాకర్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, గుండాల మండలాల కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 103మందికి నేత్ర వైద్యాధికారి డాక్టర్ సంజీవరావు కంటి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 50మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని 6వ తేదీన భద్రాచలం మారుతి నర్సింగ్ కళాశాల వారి సహకారంతో సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రికి రిఫర్ చేసి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ఆర్ఎంవోస్ డాక్టర్ నరేష్, డాక్టర్ గౌరిప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దార్థ ఒకేషనల్ కళాశాలలో..

పట్టణంలోని సిద్దార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో నేత్రాలయ ఐ కేర్ ఆస్పత్రి వారి సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ రమేష్ విద్యార్థినీ, విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వల్లభనేని అజయ్‌కుమార్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యులు బాలకృష్ణ, రమేష్, రాజశేఖర్, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, మమత, ఉష, ప్రణయ, దీపిక, షబానా తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస పూజలు



అశ్వారావుపేటరూరల్: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సాక్షినెట్‌వర్క్: శివాలయాల్లో సోమవారం కార్తీక మాస పూజలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు వేకువజామునే తలంటు స్నానాలు చేసి, సమీపంలోని శివాలయాలను సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో శివయ్యకు అర్చన, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

ఆలయానికి విరాళం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయానికి భగవద్గీత శ్లోకం టైమర్ పరికరాన్ని అశ్వారావుపేట విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు కలకోటి వెంకటేశ్వరరావు వితరణగా అందించారు. సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు మేడూరి సాంబశివ ప్రసాద్‌కు దీనిని అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బాధ్యులు శ్రీమంతులు పార్వతి, కొఠారు చలపతిరావు, శీమకుర్తి సుబ్బారావు, జంగాల రాము, నల్లపు జగన్, మల్లంపల్లి లలితాదేవి, లోకం రాము, తులసి, చిట్టి జ్యోతి, తాళం మణికంఠ, అర్చకులు రుద్రభట్ల కుమార్ శర్మ, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

8న వర్ధంతి సభ

గుండాల: కాచనపల్లి అమరవీరులను స్మరించుకుంటూ ఈ నెల 8వ తేదీన న్యూడెమోక్రసీ గుండాల, ఆళ్లపల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో కాచనపల్లి గ్రామంలో నిర్వహించే వర్ధంతి సభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు కొమరం సీతారాములు, మండల కార్యదర్శి నరేష్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శక రవి పిలుపునిచ్చారు. సోమవారం కొడవటంచ, యాపలగడ్డ గ్రామలలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. న్యూడెమోక్రసీ నాయకులు వజ్జ ఎర్రయ్య, ఈసం కృష్ణన్న,ఈసం మల్లయ్య,పటేల్ యానయ్య, వజ్జ మంగయ్య, ఈసం కృష్ణ, ఈసం రమేష్, ఆరెం రామారావు, ఆరెం సమ్మయ్య,ఈసం ఆనంద్, చీమల సుందర్రావు, చీమల వసంతారావు, బాబు, రామచంద్రయ్య, సాంబారావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల వారోత్సవ ర్యాలీ



మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గుండాల: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి పార్టీ కార్యకర్తలు ముందుండాలని ప్రజాపంథా–మాస్‌లైన్ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్, జిల్లా నాయకులు మాచర్ల సత్యం పిలుపునిచ్చారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో అమరవీరుల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాటన్న స్థూపం వద్ద నివాళులర్పించి మాస్‌లైన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెడీమేడ్ స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొమరం శాంతయ్య అధ్యక్షతన జరిగిన అమరవీరుల వారోత్సవ సభలో వారు మాట్లాడుతూ.. ఎందరో అమరులు భూమి, భుక్తి, విముక్తికి జరిగిన పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. ఈ నెల 8న ఇల్లెందు పట్టణంలో జరిగే విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కోడూరి జగన్, సనప కుమార్, తెల్లం రాజు ఈసం సింగన్న, దుగ్గి రాంబాబు, ఈసం కృష్ణ, పూనెం లక్ష్మయ్య, మోకాళ్ల ఆజాద్, పూనెం మంగయ్య, కల్తి రామన్న, ధనసరి సమ్మయ్య, కల్తి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.